క్లుప్తంగా

జగనన్న గోరుముద్దతో పౌష్టికాహారం



విద్యార్థులకు అందిస్తున్న రాగిజావను పరిశీలిస్తున్న ఎంఈఓ

వంగర: పాఠశాలల్లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకంతో విద్యార్థులకు పౌష్టికాహారం అందుతుందని ఎంఈఓ వై.దుర్గారావు తెలిపారు. శివ్వాం ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న రాగి జావను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులు పరిశీలించిన అనంతరం విద్యార్థుల విద్యా ప్రమాణాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు



స్టెప్పులేస్తున్న విద్యార్థులు

వంగర: అరసాడ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో భాగంగా వేసిన నృత్యాలు అలరించాయి. పలు సినీ, జానపద గేయాలకు నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. అంతకు ముందు వీడ్కోలు కార్యక్రమంలో హెచ్‌ఎం వి.రాజ్యలక్ష్మి మాట్లాడారు. విద్యార్థులంతా ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇంటి పన్ను వసూళ్లు



మున్సిపల్ అధికారులకు పన్ను మొత్తాన్ని అందజేస్తున్న యజమాని

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధిలో బకాయి పడిన ఇంటి పన్ను వసూళ్లను అధికారులు ముమ్మరం చేశారు. మంగళవారం పట్టణంలోని పలు దుకాణదారులు, వ్యాపారులు, మొండి బకాయిదారుల నుంచి వసూలు చేపట్టామని మేనేజర్ ఎంవీ నాగరాజు తెలిపారు. మున్సిపాల్టీలో రూ.2.63 కోట్లు బకాయిలకుగాను రూ.2.10 కోట్లు ఇప్పటి వరకు వసూలు చేశామన్నారు. ఈ నెలాఖరులోగా పన్ను బకాయిలు చెల్లించే వారందరికీ వడ్డీ మాఫీ అవుతుందని, బకాయిదారులంతా త్వరపడాలని సూచించారు.

పొగిరిలో సామాజిక తనిఖీల గ్రామసభ

రాజాం: మండలంలోని పొగిరి పంచాయతీ సచివాలయం వద్ద మంగళవారం సామాజిక తనిఖీల గ్రామ సభ నిర్వహించారు. గత నాలుగు రోజులు ఈ పంచాయతీలో డీఆర్‌పీ రామకృష్ణ బృందం సామాజిక తనిఖీలు ఉపాధి పనులపై నిర్వహించింది. వేతనదారుల వివరాలు సేకరించడంతో పాటు మెటీరియల్ పనులపై ఆరా తీసింది. మొత్తం 25 పనులకు సంబంధించి రూ.91 లక్షలపై సోషల్ ఆడిట్ చేసి గ్రామ సభలో వివరాలు వెల్లడించారు. ప్రజల వద్ద అభ్యంతరాలు సేకరించారు. పంచాయతీ సర్పంచ్ పొగిరి కృష్ణవేణి, ఎంపీడీఓ బాసూరీ శంకరరావు, ఏపీఓ సాయిరాం, పలు శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ముచ్చటగా మూడోసారి వాయిదా

రాజాం సిటీ: మున్సిపాల్టీలోని ఆశీల వేలం పాట ముచ్చటగా మూడోసారి వాయిదా పడింది. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేలంలో నిర్ణయించిన వేలంకు హెచ్చు పాడాలని పాటదారులకు కమిషనర్ డీటీవీ కృష్ణారావు, మేనేజర్ ఎంవీ నాగరాజులు సూచించారు. దీనికి పాటదారులు ముందుకు రాకపోగా ప్రభుత్వం నిర్ణయించిన పాట విలువను తగ్గించాలని కోరారు. దీనిని తగ్గించే అవకాశం లేదని కమిషనర్ స్పష్టం చేశారు. భారీ వాహనాల నుంచి ఆశీలు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుని బుధవారం పాట నిర్వహించాలని పాటదారులు అధికారులను కోరారు. దీంతో చేసేదేమీ లేక వేలంను వాయిదా వేశామని కమిషనర్ తెలిపారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

తెర్లాం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో చేపట్టిన పౌష్టికాహార పదార్థాల ప్రదర్శనను ఆయన తిలకించి, అంగన్‌వాడీ కార్యకర్తలను అభినందించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీఓ కె.రాజ్యలక్ష్మి, సూపర్‌వైజర్లు ఉషారాణి, చిట్టెమ్మ, బొబ్బిలి మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక ఎదుగుదలే.. సీఎం జగన్ ధ్యేయం

- వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

మెంటాడ: మహిళల ఆర్థిక ఎదుగుదలే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని డిప్యూటీ సీఎం, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జరిగిన వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత నిధుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథి విచ్చేసిన ఆయన తొలుత పథకం కింద మండలంలోని 788 డ్వాక్రా గ్రూపుల్లోని 8,619 సభ్యులకు మంజూరైన రూ.12.31 కోట్ల నిధులను చెక్కు రూపంలో విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా మహిళలకు అన్నిరంగాల్లో అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. వారి ఆర్థిక ప్రగతికి ఎన్నో సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థికసాయంతో ఎంతోమంది మహిళలు చిరువ్యాపారాలు పెట్టుకుని, స్వయం ఉపాధి సాధించారన్నారు. అలాగే వారి పిల్లల చదువు కోసం జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతిదీవెన పథకాల ద్వారా ఆర్థికసాయం చేస్తున్నారన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ఆయన అందిస్తున్న పథకాలు చూసిఓర్వలేకనే ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలెవరూ నమ్మడం లేదన్నారు. ప్రజల బాగోగుల కోసం నిరంతరం పరితపిస్తున్న ఇదే ప్రభుత్వాన్ని 2024లోనూ అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఆయన కోరారు. అనంతరం మహిళలంతా థాంక్యూ సీఎం జగన్ సార్ అంటూ నినాదాలు చేస్తూ ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, కృతజ్ఞతలు చాటుకున్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి, ఎంపీపీ ఆర్.సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీలు ఎస్.ఈశ్వరరావు, పి.దుర్గ, కన్వీనర్ కె.త్రినాధరావు, మండల నాయకులు ఎల్.రత్నాకర్, ఆర్. రాజప్పలనాయుడు, పీఏసీఎస్ చైర్మన్ టి.రామచంద్రరావు, ఎంపీడీఓ తివిక్రమ్, తహసీల్దార్ యు. ఆదిబాబు, ఏపీఎం దేవుడుబాబు, సర్పంచ్ ఆర్.రాంబాబు పాల్గొన్నారు.



మహిళలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర

పేదల పక్షపాతి ప్రభుత్వం..



పేదల పక్షపాతి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. నిత్యం పేదల బాగోగుల కోసం ఆలోచించే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ మళ్లీ సీఎంను చేస్తాం. నాకు పథకాల ద్వారా అందిన డబ్బులతో ఇంటి దగ్గరే చిన్నపాటి వ్యాపారం పెట్టుకున్నాను. స్వయం ఉపాధి పొందాను

– పొంద్రంకి వెంకటలక్ష్మి, మెంటాడ

జగనే మళ్లీ మళ్లీ సీఎంగా కావాలి..



సీఎం జగనే మళ్లీ మళ్లీ సీఎంగా కావాలి. ఆయన వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఇచ్చిన నగదుతో చిన్నపాటి కిరాణా కొట్టు పెట్టుకుని నాలుగు రూపాయల వెనకేసుకుంటున్నాను. సీఎం జగన్‌కు, ఆయన ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– కందులు రామలక్ష్మి, సంతతోట

ఆర్థిక భరోసా ఇస్తోంది..



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి ఆర్థిక భరోసా ఇస్తోంది. వైఎస్సార్ ఆసరా ద్వారా మూడు విడతల్లో అందిన సొమ్ముతో టిఫిన్ కొట్టు పెట్టుకున్నాను. కుటుంబమంతా ఇంటి వద్దే చక్కగా బతుకుతున్నాం.

– మలిశెట్టి పార్వతి, మెంటాడ

మహిళలకు అండగా ‘వైఎస్సార్ ఆసరా’



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

- వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

తెర్లాం: మహిళల ఆర్థికాభివృద్ధే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక స్టేట్ బ్యాంక్ ఎదురుగా ఉన్న ఆవరణలో వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత నిధుల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఇచ్చిన ప్రతీ హామీని నిలబెట్టుకున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కష్టపడుతున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రశంసించారు. ఆయన ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు అంతకుముందు ఆయన చేసిన ఓదార్పుయాత్ర, పాదయాత్ర, ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలను కూడా నెరవేరుస్తున్నారన్నారు. ఇప్పటి వరకు దాదాపు 98 శాతం హామీలు నెరవేర్చారన్నారు. మహిళా సాధికారత కోసం మహిళలకు అన్ని రంగాల్లోనూ ప్రాధాన్యమిస్తున్నారన్నారు. అలాగే వారి ఆర్థిక ప్రగతికి అనేక పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతిదీవెన ద్వారా మహిళల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తున్నారని తెలిపారు. ఎంతోమంది మహిళలు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థికసాయంతో సొంతంగా చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారని వివరించారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని, సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం తెర్లాం మండలంలోని 12,451 డ్వాక్రా గ్రూపుల సభ్యులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5.82 కోట్ల చెక్కును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెర్లాం, బొబ్బిలి మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు,

జగనన్న మేలు మరవలేం:



సీఎం జగనన్న స్వయం సహాయక సంఘాల మహిళలకు చేసిన మేలు మరవలేం. ఆయన తన పాదయాత్రలో ఇచ్చిన హామీల మేరకు సీఎం అయిన తరువాత వైఎస్సార్ ఆసరా పథకం అమలు చేసి, మా బ్యాంకు అప్పులు తీర్చుతున్నారు. మా సంఘానికి వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.6.40 లక్షలు వచ్చింది. జగనన్నకు ధన్యవాదాలు.

– దమయంతి, ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు, నందిగాం, తెర్లాం మండలం.

సీఎం జగన్‌నే మళ్లీ సీఎంని చేస్తాం..



అన్నివర్గాలకు ఎంతో మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌నే 2024లోనూ సీఎంని చేస్తాం. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతున్నారు. మా సంఘానికి వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.6 లక్షలు వర్తించింది. నాకు వచ్చిన రూ.11,500తో టైలరింగ్ మిషన్లు కొనుగోలు చేసుకుని, ఉపాధి పొందాను. సీఎం జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాను.

– అక్కివరపు రవణమ్మ, డ్వాక్రా మహిళ, కొరటాం, తెర్లాం మండలం.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు..



తాను అధికారంలోకి వస్తే డ్వాక్రా అక్కచెల్లెమ్మల బ్యాంకు అప్పును వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగు విడతల్లో చెల్లిస్తానని ఇచ్చిన మాట నిలబెట్టుకున్న వ్యక్తి సీఎం వైఎస్ జగన్. గత ప్రభుత్వం రుణాలు మాఫీ చేస్తామని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చినా ఆ హామీని నెరవేర్చలేదు. కానీ సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం మా అప్పులకు సంబంధించి, మూడు విడతలుగా వైఎస్సార్ ఆసరా పథకం అమలు చేశారు. సీఎం జగన్ మేలు ఎన్నటికీ మరువలేం.

– పి.సత్యవతి, డ్వాక్రా మహిళ, వెలగవలస, తెర్లాం మండలం.

ఘనంగా గ్రామదేవత సంబరాలు



మందరాడలో అసిరితల్లి ప్రభ తిరువీధి

సంతకవిటి: మండలంలో మందరాడ గ్రామంలో గ్రామదేవత అసిరితల్లి, మొయ్యమ్మతల్లి దేవత సంబరాలు వైభవంగా జరిగాయి. గ్రామానికి చెందిన ముతికి కుటుంబీకులు మంగళవారం ఈ సంబరాలు నిర్వహించారు. గ్రామదేవత ప్రభను తయారీచేసి కత్తి సాము, కోలాటాల మధ్య ఘటాల తిరువీధి నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించారు. మందరాడ, కాకరాపల్లి, బొద్దూరు, సంతకవిటి, చిన్నయ్యపేట, చింతలపేట, అక్కరాపల్లి, మామిడిపల్లి, పుల్లిట తదితర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాల రికవరీని వేగవంతం చేయండి

మెంటాడ: స్థానిక వెలుగు కార్యాలయంలో బుక్‌కీపర్లతో డీఆర్‌డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి మంగళవారం సమావేశమై, స్త్రీనిధి రుణాల రికవరీని వేగవంతం చేయాలని సూచించారు. కొంతమంది బుక్‌కీపర్లు లబ్ధిదారుల దగ్గర నుంచి రుణాలు వసూలు చేసి, తమ సొంతానికి వినియోగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయని, ఇప్పటికైనా బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. సమావేశంలో ఏజీఎం ఉమామహేశ్వరరావు, ఏపీఎం దేవుడుబాబు పాల్గొన్నారు.



బుక్ కీపర్లతో సమావేశమైన డీఆర్‌డీఏ పీడీ

పౌష్టికాహారం వినియోగంపై అవగాహన



పౌష్టికాహారం వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పద్మావతి

రామభద్రపురం: స్థానిక అంగన్‌వాడీ కేంద్రం–5లో పౌష్టికాహారం వినియోగంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జె.పద్మావతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులను కోరారు. పౌష్టికాహారం క్రమం తప్పకుండా తినడం ద్వారా సంపూర్ణ ఆరోగ్య లభిస్తుందన్నారు.

‘చలో ఢిల్లీ’ విజయవంతం చేయండి

బొబ్బిలి: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5వ తేదీన చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు పిలుపునిచ్చారు. ఇదే విషయమై రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆయన మండల కేంద్రంలో మంగళవారం ఆవిష్కరించారు. ఆ రోజు జరిగే కార్యక్రమంలో అందరూ పాల్గొని, కేంద్రంలోని మోదీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5వ తేదీన చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని సీఐటీయూ నేత ఆర్.సురేష్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన సెక్టార్ సమావేశంలో కార్యక్రమానికి పిలుపునిస్తూ రూపొందించిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

ఘనంగా గరగాలమ్మ పండగ

రామభద్రపురం: మండలంలోని ఎస్.చింతలవలస గ్రామంలో గరగాలమ్మతల్లి పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. దాదాపు 25 ఏళ్ల తర్వాత జరిగే పండగ కావడంతో వృత్తి రీత్యా రాష్ట్రంలోని పలుచోట్ల స్థిరపడిన వారంతా గ్రామానికి రావడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది.

28 మద్యంబాటిళ్ల స్వాధీనం

బొబ్బిలి: బాడంగి మండలంలోని గజరాయునివలస గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న జామి దాసు, సత్యవరపు రవికుమార్‌లను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. అనంతరం వారి నుంచి 28 మద్యంబాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

రైతు సమస్యలు పరిష్కరించండి

వంగర: గ్రామాల్లో ధాన్యం విక్రయాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సివిల్ సప్లయ్ డీటీ బలివాడ గోవిందరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. రబీ సీజన్‌లో ధాన్యం విక్రయాలకు సంబంధించి ట్రక్కుషీట్‌లు ముగించాలని వెల్లడించారు. అనంతరం సివిల్ సప్లయ్ డీలర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

నేడు ప్రజావేదిక

రాజాం: మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం ఉదయం 10 గంటలకు ఉపాధి పనుల సామాజిక తనిఖీలపై ప్రజా వేదిక ఉంటుందని ఎంపీడీఓ బాసూరీ శంకరరావు మంగళవారం తెలిపారు. మండలంలో గత ఏడాది కాలంగా జరిగిన ఉపాధి పనులకు సంబంధించిన 14 రోజులుగా క్షేత్ర స్థాయిలో ప్రతీ పంచాయతీలో సామాజిక తనిఖీలు జరిగాయని అన్నారు. రూ.9,52,94,399 వేతన నిధులతో పాటు రూ.2,53,36,818 మెటీరియల్ పనులతో కలిపి మొత్తం రూ. 13,04,31,358 లపై ఈ ఆడిట్ జరిగిందని, ఆయా పంచాయతీ పరిధిలో కూడా గ్రామసభలు నిర్వహణ సోషల్ ఆడిట్ టీం నిర్వహించిందని పేర్కొన్నారు. మండలం యూనిట్‌గా సామాజిక తనిఖీల్లో వెలుగు చూసిన అక్రమాలు టీం సభ్యులు బయటపెడతారని వివరించారు. పలు పంచాయతీల ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు ఈ ప్రజా వేదికలో పాల్గొంటారని, పంచాయతీల్లో సందేహాలు నివృత్తి కాని వారు కూడా ఈ ప్రజా వేదికలో పాల్గొనవచ్చునని అన్నారు.

పూర్వపు విద్యార్థి ఔదార్యం

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో గతంలో చదువుకున్న కెంబూరు శ్రీనివాసరావు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న గోరుముద్దలో భాగంగా విద్యార్థులకు రాగి అంబలిని ఏర్పాటు చేశారు. ఈ అంబలిని విద్యార్థులు తాగేందుకు అవసరమైన 125 గ్లాసులను పాఠశాలకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు, పాఠశాల హెచ్‌ఎం మురపాక వెంకటరమణ, సర్పంచ్ కెంబూరు వెంకటేశ్వరరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ కర్నేని రమాదేవి తదితరులు అభినందించారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

తెర్లాం: మండలంలోని ఎస్.బూర్జవలస గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు మంగళవారం వేశారు. తీవ్రమైన జ్వరం, నోటి వెంట చొంగ కారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే పశువైద్య కేంద్రాలకు పశువులను తరలించి, గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి జె.నరేంద్రకుమార్ సూచించారు.

పనులకు అడ్డంకులు ఉండరాదు



సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: రాజాం ప్రధాన రహదారి విస్తరణ పనులకు మున్సిపల్ శాఖ నుంచి ఎటువంటి అభ్యంతరాలు, ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావుకు రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు సూచించారు. రూ. 20 కోట్లు అంచనా వ్యయంతో జరుగుతున్న రాజాం ప్రధాన రహదారి రెండో విడత విస్తరణపై వివరాలు మంగళవారం సేకరించారు. పార్టీ కార్యాలయం వద్ద మున్సిపల్ కమిషనర్‌తో పాటు టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్, విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షించారు. గాయత్రి కాలనీ వద్ద రోడ్డు విస్తరణకు సంబంధించి మురుగు కాలువలు ఏర్పాటు జరుగుతుందని, పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మాణం జరిగేలా అన్ని ఏర్పాట్లు చేశామని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో మేనేజర్ ఎంవీ నాగరాజు, టీపీఓ నాగలత, ఏఈ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

సహారా ఏజెంట్ల ఆందోళన

రాజాం సిటీ: రాజాం సహారా కార్యాలయంలో ఏజెంట్లు ఆందోళన చేపట్టారు. మంగళవారం కార్యాలయానికి రీజనల్ మేనేజర్ బి.లక్ష్మణరావు, సెక్టార్ మేనేజర్ జె.కామేశ్వరరావు వచ్చారని తెలుసుకున్న ఏజెంట్లు, బాధితులు కార్యాలయానికి చేరుకున్నారు. బాండ్లు గడువు తీరినప్పటికీ డబ్బులు ఇవ్వపోవడంతో ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో మమ్మల్ని నమ్మి డబ్బులు కట్టిన బాధితులు తమను నిలదీస్తున్నారని ఏజెంట్లంతా అధికారులను నిలదీశారు. ఖాతాదారులకు ఏ విషయం చెప్పలేక నానా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. దీనికి స్పందించి కోర్టు అడ్డంకి తొలగిన వెంటనే అందిరికీ నగదు చెల్లింపులు జరుగుతాయని అధికారులు తెలిపారు.



అధికారులను నిలదీస్తున్న ఏజెంట్లు, ఖాతాదారులు

వృద్ధుల పరిరక్షణ చట్టాలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఆర్‌డీఓ శేషశైలజ

బొబ్బిలి రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వృద్ధుల పరిరక్షణ చట్టాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ పి.శేషశైలజ మాట్లాడుతూ వృద్ధుల పరిరక్షణ చట్టాల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. వృద్ధులు ఎటువంటి ఇబ్బందులు పడినా టోల్ ఫ్రీ నంబర్ 14567కు ఫోన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వృద్ధుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.చంద్రశేఖరం, ఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. రామ్మూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ

తెర్లాం: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని 80 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు చేతులమీదుగా మంగళవారం కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కంటి సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులకు ప్రభుత్వంగా ఉచితంగా పరీక్షలు చేయడంతో పాటు కళ్లద్దాలు కూడా పంపిణీ చేస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉమాలక్ష్మి, జెడ్పీటీసీ లూర్థు పాల్గొన్నారు.



విద్యార్థులకు కళ్లద్దాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి